మాదక ద్రవ్యాలను అరికట్టాలి



రెడ్డిగూడెం: మత్తు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు యువత సహకరించాలని మైలవరం స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ గిరిజ అన్నారు. స్థానిక వికాస్ కళాశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గిరిజ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు లోను కాకుండా చదువుపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం అస్తవ్యస్తమవుతుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం



తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ కస్తూరిబాయి

తిరువూరు: పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి తెలిపారు. నగర పంచాయతీ అత్యవసర సమావేశం శనివారం జరిగింది. గోతులమయమైన రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరగా, త్వరలోనే సీసీ రహదారుల నిర్మాణం చేపడతామని చైర్‌పర్సన్ తెలిపారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనుల నిర్వహణకు నిధులు మంజూరయ్యాయని, పారదర్శకంగా పనులు చేపడతామని చెప్పారు. కుక్కలు, కోతులు, పందుల బెడద నివారించాలని, మంచినీటి పైపులైన్ల నిర్మాణానికి తవ్విన రహదారులు పునర్నిర్మించాలని కౌన్సిలర్లు కోరారు. పట్టణంలోని దారా పూర్ణయ్య టౌన్‌షిప్‌లో సామాజిక అవసరాలకు కేటాయించిన స్థలాన్ని ప్రజోపయోగానికి వినియోగించాలని కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. ఇన్‌చార్జి కమిషనర్ వేంకటేశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు



తిరువూరు శ్రీనిధి స్కూల్లో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

తిరువూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కార్యక్రమాలు నిర్వహించారు. మల్లేల, కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. తిరువూరు శ్రీనిధి స్కూల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. నూతన సంవత్సర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాడి రైతుల శ్రేయస్సుకు కృషి

రామన్నపాలెం(గంపలగూడెం): పాడి రైతుల శ్రేయస్సు కోసం కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తుందని కృష్ణా ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని ఆర్లపాడు శివారు రామన్నపాలెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో మండల పరిధిలోని పలు సంఘాల అధ్యక్షులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిశాతం వెన్న కలిగిన లీటర్ పాలకు రూ.5 ఇకపై అధికంగా చెల్లిస్తామన్నారు. ఆవుపాల ధర కూడా అదనంగా రూ.10 పెంచనున్నట్లు ఆయన వివరించారు. వివిధ గ్రామాల పాల సంఘాల అధ్యక్షులు భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సంగమేశ్వరరావు, సత్యనారాయణ, ఇమ్మానుయేలు, సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం: మానసిక, శారీరక ఆరోగ్యం ఉన్నప్పుడే ప్రతి వ్యక్తి సమర్థంగా పనిచేయగలుగుతారని ఎన్టీటీపీఎస్ ఎస్ఈ సురేష్‌బాబు అన్నారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12 రోజులుగా నిర్వహించిన యోగా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యోగా గురువు లంకే జనార్దన్ మాట్లాడుతూ యోగాతో పాటు ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం ప్రాణాయామం, ధ్యానం, యోగాసనాలపై అవగాహన కల్పించారు. జలనేతి క్రియ సాధన ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు పాల్గొన్నారు.

కొండపర్వ పాఠశాలలో నూతన వత్సర వేడుకలు

కొండపర్వ (విస్సన్నపేట):నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మండలంలోని కొండపర్వ ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలో అందంగా ముగ్గులు వేశారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.











విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. మూలపాడు జెడ్పీ పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను శనివారం ఆమె 8వ తరగతి విద్యార్థులకు పంపిణీచేశారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం టెన్త్‌క్లాస్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శించారు. వైస్ ఎంపీపీ బి.నాగబాలమ్మ, ఎంపీడీవో రామకృష్ణనాయక్, ఎంఈవో పుష్పలత, హెచ్‌ఎం లక్ష్మి, మండల కన్వీనర్ బొంతా సాంబశివ రావు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


చంద్రాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జ్యోతి, మాజీ ఎంపీపీ గంగాధరరావు


మూలపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్ అందజేసిన జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి, ఎంపీపీ జ్యోత్స్న

చంద్రాలలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

చంద్రాల(మైలవరం): పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పథకాలు అమలు చేస్తున్నారని, దీనిలో భాగంగానే 8వ తరగతి నుంచి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నారని మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు 30 మందికి శనివారం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ జె.జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.











విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

జి.కొండూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగపరుచుకొని ప్రయివేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక తన సొంత నిధులతో పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన జగనన్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను స్థానిక సర్పంచ్ పిల్లి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి ప్రసాద్ కలిసి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గంగినేని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక


టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే ప్రతాప్

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శుక్రవారం రాత్రి జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ మేరకు నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చల్లపల్లి ఏసు, చల్లపల్లి నాగమల్లేశ్వరావు, కొమ్ము లక్ష్మణరావు, కొమ్ము సతీష్‌లకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావు, గ్రామ సర్పంచ్ పరసా ధనలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, నాయకులు కారంగుల వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

30-12-2022

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్థానిక శ్రామికనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ వేముల రూతు శనివారం పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. నాడు–నేడు రెండోదశ పనులు పరిశీలించారు.





ఆంక్షలు ఉల్లంఘిస్తే చర్యలు


మైలవరం: మండలంలో నూతన సంవత్సరం ఆరంభం దృష్ట్యా ప్రత్యేక ఆంక్షలు విధించినట్టు ఎస్ఐ రాంబాబు తెలిపారు. మద్యం తాగి బైక్ నడపడం, ట్రిపుల్ రైడింగ్, రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, బాణసంచా కాల్చడం. డీజేలు, డ్యాన్సులు నిషిద్ధమని చెప్పారు. మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ముఠావర్కర్స్ యూనియన్ కార్యవర్గ ఎన్నిక

తిరువూరు: ముఠా వర్కర్ల యూనియన్ తిరువూరు మండల శాఖ మహాసభ శనివారం సుందరయ్య భవన్‌లో జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా మట్టగుంజ బాబు, మరకాల ఇశ్రాయేలు, గౌరవాధ్యక్షులుగా బి.వెంకటేశ్వరరావు, ఆకుల రామారావు ఎన్నికయ్యారు. సీఐటీయూ నాయకులు ఎస్‌వీ భద్రం, ఆకుల రవి పాల్గొన్నారు.


















వైఎస్సార్ సీపీతోనే ప్రజారంజక పాలన

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రంలో ప్రజా రంజక పాలన సాధ్యమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని ఎస్‌ఏ పేట, నెక్కలం గొల్లగూడెం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వానికి చెందిన రెవెన్యూ భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసైన్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి త్వరలోనే పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్.ఏ.పేటలో 200 మంది రైతులు పట్టాలు కోరుతూ అర్జీలు అందజేశారు. ఇళ్ల స్థలాలు లేనివారు 50 మంది ఉన్నారని వారికి రెండు ఎకరాల్లో స్థలాన్ని చూసి జగనన్న కాలనీకి సంబంధించి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఉదయ్ భాస్కరరావును ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం నెక్కలం గొల్లగూడెం సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఎంపీటీసీ గుర్రం శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో మల్లయ్యగట్టు ఉందని దానిలో అటవీ భూమి, రెవెన్యూ భూమి ఉందని దానిలో 200 మంది రైతులు 40 ఏళ్లగా సాగు చేసుకుంటున్నారని గట్టును జాయింట్ సర్వే చేయించి రెవెన్యూ భూమిలో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ, గ్రామ సర్పంచి లింగవరపు రమేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మంగళ గట్టు, సూదిగట్టు, ఎర్ని గట్టులో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ రైతులు అర్జీలు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లయ్య గట్టు జాయింట్ సర్వే నిర్వహించి రెవెన్యూ భూమిలో సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులను గుర్తించి పట్టాలు ఇచ్చేలా చూడాలని తహసీల్దార్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈదులగూడెంలో సర్వే నంబర్ 1లో సుమారుగా 90 ఎకరాల కొండ పోరంబోకు భూమి గత 20 సంవత్సరాలుగా 106 మంది రైతులు సాగు చేసుకుంటున్నారని రైతుల జాబితాను అసైన్‌మెంట్ జాబితాలో చేర్చమని ఎమ్మెల్యేకు ఈదులగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య అర్జీ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ అనూష ఇసాక్, ఎస్‌ఏపేట సర్పంచి కూరాకుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కంచర్ల నిర్మలకుమారి పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ప్రతాప్ శుభాకాంక్షలు



నూజివీడు: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులతో, కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు.

నూతన వత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలి : డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్



నూజివీడు: నూతన సంవత్సర వేడుకలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని నూజివీడు డీఎస్పీ ఇ.అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. నూజివీడులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు తగు జాగ్రత్తలు చెప్పాలన్నారు. యువకులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. బార్లు, రెస్టారెంట్ల యజమానులు నిర్ణీత సమయంలో తప్పనిసరిగా షాపులను మూసివేయాలన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసువారి ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి వీల్లేదన్నారు. రోడ్లపై కేకులు కోయడం, బహిరంగ ప్రదేశాలలో బాణసంచా కాల్చడం, ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్‌లను వాహనాలకు ఉపయోగించి ధ్వని కాలుష్యానికి గురిచేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



























క్లుప్తంగా

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



ముసునూరు: ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ నాణ్యతగా ప్రజలకు అందాలని జిల్లా వైద్యాధికారి, మండల నూతన ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సూరేపల్లి గ్రామ సచివాలయం, ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య, వ్యాయామ విద్యల ప్రాధాన్యతను వివరించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పోషకాహారాన్ని తనిఖీ చేశారు. రమణక్కపేట పీహెచ్‌సీ ఓపీ వివరాలను, ఫార్మసీ, రోగులకు అందుతున్న సదుపాయాలను వైద్యాధికారి కరీముల్లాను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నానో టెక్నాలజీపై పట్టు సాధించాలి

తిరువూరు: బీటెక్ విద్యార్థులు నానో టెక్నాలజీపై పట్టు సాధిస్తే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐఐటీ తిరువనంతపురం ప్రొఫెసర్ రాజేంద్ర సూచించారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నానో టెక్నాలజీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే పోటీ ప్రపంచంలో మనగలుగుతారని, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



ఆగిరిపల్లి: మండలంలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఐటీ విభాగానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ క్లబ్ 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ రోశయ్య, ప్లేస్‌మెంట్ అధికారి సురేంద్రబాబు, ఐటీ విభాగపతి చైతన్య కిషోర్‌రెడ్డి, క్లబ్ కోఆర్డినేటర్ గోపాలకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వితంతు, వృద్ధ మహిళలకు చీరల పంపిణీ



ముసునూరు: వితంతు వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. ముసునూరు సిల్క్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకుని హెచ్ఎం బాబూరావు తన సొంత నిధులతో 10 మంది వితంతువులు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దాసరి సుధ, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, కార్యాలయ పర్యవేక్షకుడు కె.సాయిరామ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

వీరులపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకే ప్రభుత్వం ట్యాబ్‌లను పంపిణీ చేస్తుందని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ఏహెచ్‌యూపీ పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు శనివారం ఆమె ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ రామతులసి, కిరణ్మయి, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావ్, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి పనుల ప్రారంభం



సాగు భూముల్లోకి వెళ్లే రహదారి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: మల్లేశ్వరంలో రైతుల సాగు భూముల్లోకి వెళ్లే రహదారి నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మల్లిబోయినపల్లి సమీపంలోని అట్టల ఫ్యాక్టరీ నుంచి మల్లేశ్వరంలో గల రైతులు తమ సాగు భూముల్లోకి వెళ్లేందుకు ఇక్కట్లు పడుతున్నారని పలువురు నాయకులు, రైతులు కలిసి తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలు, జెడ్పీ నిధులు రూ.10 లక్షలు కలిపి మొత్తం రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ముందుగా రూ.5 లక్షలు ఎమ్మెల్యే నిధులతో సాగు భూముల్లోకి వెళ్లేందుకు 2 కి.మీ మేర గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి హరిబాబు, జెడ్పీటీసీ వీరబాబు, ఎంపీటీసీ గోపీనాథ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ నక్కనబోయిన పండు, రెడ్డి వెంకట నారాయణ, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్ సుభాని, కోఆప్షన్ సభ్యుడు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యం

కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర



మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పార్టీల కతీతంగా వ్యక్తిగత విభేదాలు పక్కకు పెట్టి పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుదామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన శనివారంర కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎజెండాలోని అంశాలను సీసీ తాజుద్దీన్ కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు.

డంపింగ్ యార్డు కోసం స్థలం కోసం అన్వేషిస్తున్నామని, దొరికిన వెంటనే నిర్మాణ చేపడతామని చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు. ఎజెండాలోని 4 వ అంశానికి సంబంధించి ప్రతిపక్ష సభ్యుడు వెంకట్ మాట్లాడుతూ ముక్త్యాల రోడ్‌లో డంపింగ్ యార్డులో షెడ్‌లు, ప్లాట్ ఫారాలు నిర్మించడానికి రూ.4 లక్షలకు పైగా ఖర్చు చేయడం ఎందుకని ప్రశ్నించారు. చెత్త డంపింగ్‌ను వేరే చోటకు మార్చాలని, ఈ అంశాన్ని కౌన్సిల్ ఆమోదానికి పెట్టవద్దని, ఆపాలని కోరారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఎట్టి పరిస్థితులో ఆపడం కుదరదని తేల్చి చెప్పారు. ఇటీవల అక్కడ పొగరావడంతో పెద్ద ఇష్యూ అయిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్యుల మేరకు షెడ్లు నిర్మాణం జరగాలని, అంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. ఇదంతా తాత్కాలికమేనని, ప్రత్యామ్నాయ స్థలం టౌన్ ప్లానింగ్ వారు చూడాలని ఆదేశించారు. అనంతరం పలు అంశాలను చర్చించిన అనంతరం ఎజెండాలోని 21 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సాయంత్రం 4 గంటలకు అత్యవసర సమావేశం నిర్వహించారు.

దుర్గాపురం అంశంపై పాలక, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం....

అత్యవసర సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ దుర్గాపురంలో ఇళ్ల పట్టాలకు సంబంధించి చెరువు కింద 20 ఏళ్లుగా ఉంటున్న నివాసితులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఏడబ్ల్యుడీ భూమిగా మార్పు చేసేందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయాల్సి ఉందన్నారు. దీంతో ప్రతిపక్ష సభ్యురాలు కె.రామలక్ష్మి మాట్లాడుతూ దుర్గాపురం ఇళ్ల పట్టాల విషయంలో గతంలో మాజీ ఎమ్మెల్యే తాతయ్య చేసిన ప్రయత్నాలకు ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైఎస్సార్ సీపీ వారు ఫిర్యాదులు చేసి ఆపే ప్రయత్నం చేశారని అన్నారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పాలకవర్గ సభ్యులు వట్టెం మనోహర్ తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. ఆధారాలు ఉన్నాయా అని నిలదీయడంతో, ఉంటే ఏంచేస్తారని ఆమె వాదించడంతో ప్రభాకర్, మనోహర్‌లు రాజీనామా చేస్తాము, చాలెంజ్ అన్నారు. పదేపదే మాజీ ఎమ్మెల్యే పేరు ప్రస్తావించవద్దని, ఎమ్మెల్యే ఉదయభాను గాని, ఆయన వర్గీయులు గాని అన్నంపెట్టే వారే గాని ఆ చేయిని నరికే వారు కాదని చెప్పారు. రూ 1.20 కోట్లు పనులు వెనక్కు పోకుండా కాంట్రాక్టర్‌ను ఒప్పించి మరి చేయించారని గుర్తుచేశారు. మాజీ సర్పంచ్ విశ్వనాథం హయాంలో స్థలాలు ఇచ్చిన వందల మందికి ఉదయభాను పట్టాలు తెచ్చి ఆదుకున్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని తెలిపారు. దీంతో రామలక్ష్మి వెనక్కు తగ్గారు.



కేక్ కటింగ్‌లో పాల్గొన్న చైర్మన్, కౌన్సిల్ సభ్యులు

పింఛన్లు పెంచిన ఘనత వైఎస్సార్ సీపీదే....

పట్టణంలో పింఛన్లు తొలగించేందుకు నోటీసులు ఇస్తున్నారని కౌన్సిలర్ రామలక్ష్మి ఆరోపించడంతో 8 వ వార్డు కౌన్సిలర్ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ లేచి పింఛన్లు గురించి మాట్లాడే అర్హత టీడీపీ వారికి లేదన్నారు. గతంలో 36 లక్షల మందికి ఇస్తే, నేడు మా ప్రభుత్వంలో 65 లక్షల మందికి ఇస్తున్నామని తెలిపారు. అలాగే రూ. 2 వేల నుంచి రూ.2,750 పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని సగర్వంగా చెబుతామన్నారు. ఎజెండాలోని సింగిల్ అంశాన్ని ఆమోదించారు.

పలువురు సభ్యుల సమస్యల ప్రస్తావన...

ఇంకా కౌన్సిలర్లు నూకల సాంబ, వెంకట్రావు, కొలగాని రాము, గీతా రాణి, సైదేశ్వరరావు, సుందరమ్మ, తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. కమిషనర్ శివకోటేశ్వరరావు, వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, అందరు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్లు, పాలక, ప్రతిపక్ష సభ్యులు కలసి కేక్ కట్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొని పట్టణ ప్రజలకు కూడా చెప్పారు.

పట్టణ అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో కృషి

చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ



నూజివీడు: పట్టణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నేతృత్వంలో నిరంతరం కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ చెప్పారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ప్రజలందరికీ మెరుగైన సేవలు అందాలంటే ఆస్తి పన్నును సకాలంలో చెల్లించాలన్నారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారులు పలువురు తమ కేటాయించిన ఫ్లాట్లను రద్దు చేసుకుంటే వారికి డబ్బులు వెనక్కు చెల్లించాలన్నారు. వారికి కావలసిన ఫ్లాటును బట్టి రూ.50 వేలు, రూ.లక్ష చెల్లించారన్నారు. దీనికి మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ బదులిస్తూ ప్రభుత్వం చెల్లిస్తుందని, అయితే ఎప్పుడు చెల్లిస్తుందో తెలియదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.500 చెల్లించిన లబ్ధిదారులకు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీ చేసి వారికి ఉచితంగా ఫ్లాట్లను కేటాయించిందన్నారు. రాబోయే రెండు, మూడు నెలల్లో లబ్ధిదారులకు ఫ్లాట్లను కేటాయిస్తామన్నారు. సమావేశంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.40 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల అమలుకు తీర్మానం చేశారు. సమావేశంలో టీపీవో చిన వెంకయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని 18వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని అంతర్గత రహదారులను లెవెలింగ్ చేయడంతో పాటు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతోటే పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవచ్చని గుర్తు చేశారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

లింగాల(వత్సవాయి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న మోడల్ కాలనీ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, వైఎస్ ఎంపీపీ కాటేపల్లి రామలక్ష్మి సూచించారు. లింగాల గ్రామంలో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోడల్ కాలనీ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. దానికనుగుణంగా లబ్ధిదారులు దగ్గరుండి ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను త్వరగా అందించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. సొసైటీ అధ్యక్షుడు కాటేపల్లి రవికుమార్, సర్పంచ్‌లు వడ్డే పరమయ్య, మాడుగుల లాజర్, రమాకాంత్, కోటయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

280 నూతన పింఛన్లు మంజూరు

నూజివీడు: మండలంలో జనవరి నుంచి 280 మందికి నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు ఈవోపీఆర్డీ సరస్వతి తెలిపారు. మండలంలో 10,365 మందికి పింఛన్లు ఇస్తుండగా ఇకనుంచి 10,645 మందికి పింఛన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పల్లెర్లమూడిలో అత్యధికంగా 28 నూతన పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పంచాయతీల వారీగా మంజూరైన పింఛన్ల వివరాలు ఇలా ఉన్నాయి. అన్నవరం 12, బత్తులవారిగూడెం 6, బోర్వంచ 25, దేవరగుంట 14, దిగవల్లి 10, తూర్పుదిగవల్లి 4, గొల్లపల్లి 18, మీర్జాపురం 15, మొర్సపూడి 7, ముక్కొల్లుపాడు 9, పాతరావిచర్ల 13, హనుమంతులగూడెం 9, జంగంగూడెం 10, ఎంఎస్‌పాలెం 18, మర్రిబంధం 2, పోలసానపల్లి 10, పోతురెడ్డిపల్లి 12, రావిచర్ల 6, సీతారామపురం 10, సిద్ధార్థనగర్ 15, సుంకొల్లు 13, యనమదల 6, తుక్కులూరు 3, వెంకటాయపాలెం 5 చొప్పున మంజూరయ్యాయన్నారు.

చర్మకారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

నందిగామ: పట్టణంలోని చర్మకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని చర్మకారుల సంక్షేమ సంఘం నందిగామ శాఖ నూతన అధ్యక్షుడు మండూరి బాబూరావు పేర్కొన్నారు. రాష్ట్ర చర్మకారుల సంఘం నందిగామ శాఖ సాధారణ సమావేశం శనివారం జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కటారపు రాము, ప్రధాన కార్యదర్శిగా గురవయ్య, సంయుక్త కార్యదర్శిగా కటారపు బాబు, కోశాధికారిగా దేవరకొండ దేవయ్యలను ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. గౌరవ న్యాయ సలహాదారుగా మట్టా ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా కన్నెకంటి జీవరత్నం ఎన్నికయ్యారు. 2023 ఏడాదికి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు.

సందడే.. సందడి..

సర్వత్రా నూతన సంవత్సర ఉత్సాహం

నందిగామ: అంతటా కొత్త సంవత్సరానికి స్వాగతం ఉత్సాహం కనిపిస్తోంది. కొత్త సంవత్సరమంటే అందరికీ పండుగే. నియోజకవర్గంలో అతి పెద్ద వ్యాపార కూడలి కావడంతో పట్టణం నుంచే కాకుండా గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున జనం తరలివచ్చి స్వీట్లు, చాక్లెట్లు కొనుగోలు చేశారు. ఇక కేక్‌లకు ఎక్కడ లేని డిమాండ్ ఏర్పడింది. పలువురు వ్యాపారులు పోటీలు పడి వివిధ రూపాల్లో, వివిధ పరిమాణాల్లో కేక్‌లను తయారుచేసి విక్రయాలు జరుపుతున్నారు. మెయిన్ బజారులో ఏకంగా షాపుల ముంగిట టెంట్లు వేసి మరీ కేక్‌ల విక్రయాలు సాగిస్తున్నారు.

కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా నందిగామ పట్టణంలోని మెయిన్ బజారు జనాలతో కిటకిటలాడింది. ఏ స్టాల్ వద్ద చూసినా, కొనుగోలుదారులే దర్శనమిస్తున్నారు. జోరుగా కొనుగోళ్లు జరుగుతుండటంతో వ్యాపారుల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. కేక్‌లు, మిఠాయిల కొట్లు, పండ్ల దుకాణాలకు జనం ఎగబడుతున్నారు. కొత్త సంవత్సరంలో వీఐపీలను కలవడం ఆనవాయితీ. ఈ క్రమంలో అటువంటి వారి కోసం ఈ ఏడాది ఆకర్షణీయమైన బొకేలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. చాలా మంది అధికారులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నతాధికారులు, ఆయా వర్గాల నాయకులను కలిసే క్రమంలో వారికి బొకేలు, పండ్లు, స్వీట్లు ఇస్తూ శుభాకాంక్షలు చెప్పడం ఆనవాయితీ.

జగ్గయ్యపేట అర్బన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలో శనివారం పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మున్సిపల్ సెంటర్, బస్టాండ్ సెంటర్, నెహ్రూచౌక్, రైతు బజారు సెంటర్, ముక్త్యాల రోడ్‌లో, కోదాడ్ రోడ్‌లో పలు బేకరీలు, ఫ్యాన్సీ సోర్ట్స్, పండ్ల, స్వీట్లు దుకాణాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించి ముస్తాబుచేశారు. ప్రధానంగా కేక్‌లను కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు బేకరీల వద్ద గుమికూడారు. యువకులు, విద్యార్థులు తమ స్నేహితులకు శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్స్ కోసం ఫ్యాన్సీ స్టోర్స్ వద్ద బారులుతీరారు.



పలు మోడల్స్‌లో న్యూ ఇయర్ కేక్స్

నందిగామ: న్యూ ఇయర్‌కు రంగవల్లులతో స్వాగతం పలికేందుకు మహిళలు ముచ్చట పడుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో రంగవల్లులకు మరింత అందాన్నిచ్చే రంగులకు శనివారం నందిగామ మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో రంగుల విక్రయాలు జోరుగా సాగాయి.



నందిగామ మెయిన్ బజారులో కోలాహలం



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఆకట్టుకుంటున్న బొకేలు



జగ్గయ్యపేటలో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



మున్సిపల్ సెంటర్లో దుకాణాల్లో కేకులు విక్రయిస్తున్న దృశ్యం











అయ్యప్ప మాలధారుల నిరసన ప్రదర్శన



రెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో నిరసన తెలియజేస్తున్న హిందూ సంఘు కార్యకర్తలు, అయ్యప్పమాలధారులు

రెడ్డిగూడెం: హిందూ దేవతల గురించి అసభ్యకరంగా మాట్లాడిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని రెడ్డిగూడెం మండల అయ్యప్ప మాలధారులు, హిందూ సంఘాల కార్యకర్తలు శనివారం రెడ్డిగూడెం ప్రధాన సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌కు, ఎస్‌ఐకు వినతిపత్రాలు సమర్పించారు. నిరసన కార్యక్రమంలో చల్లా శివరాం ప్రసాద్, స్వాములు బి.రామారావు, కె.వెంకటకృష్ణ, జి.ప్రభాకరరెడ్డి, సురేష్‌రెడ్డి, జమలారెడ్డి, వెంకటరెడ్డి, ధర్మ జాగరణ సమితి రెడ్డిగూడెం మండల అధ్యక్షులు నమ్మిక శివనాగులు తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలి

గంపలగూడెం: హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా పలువురు దేవతలను కించపరుస్తూ అసభ్యకరంగా మాట్లాడిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప సమితి మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం గంపలగూడెంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నరేష్ మాట్లాడిన తీరును ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా నరేష్‌ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎస్‌ఐ వి.సతీష్‌లకు అందజేశారు.

బైరి నరేష్‌పై అయ్యప్ప భక్తుల ఫిర్యాదు

మైలవరం: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని, హిందూ ధర్మాన్ని కాపాడాలని కోరుతూ మైలవరం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అయ్యప్ప భక్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానం నుంచి అయ్యప్పలు ర్యాలీగా బయలుదేరి పురవీధుల్లో తిరిగి హిందూ ధర్మాన్ని కాపాడాలని, హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

మిరపలో నల్లతామర పురుగు నివారణకు చర్యలు



గంగినేని గ్రామంలో మిరప తోటలను పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మితిరుపతమ్మ, జెడ్పీటీసీ మందా జక్రధరరావు, వ్యవసాయ అధికారులు

జి.కొండూరు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మిరప పంటను ఆశించే నల్ల తామర పురుగు వలన రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నందున నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బాలాజీ అన్నారు. గంగినేని గ్రామంలో నల్లతామర పురుగు ఆశించిన మిరప పైరును ఆయన స్థానిక అధికారులు, ఎంపీపీ వేములకొండ లక్ష్మితిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావుతో కలిసి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ అధికారి నీలిమ, మండల ఏఓ రాంకుమార్, సర్పంచ్ పిల్లి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వసంత నూతన సంవత్సర శుభాకాంక్షలు



మైలవరం: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎంతో సుభిక్షంగా ఉన్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నూతన ఏడాదిలో పెంచిన పింఛన్ సొమ్ము రూ.2750 అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం



గంపలగూడెం: గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయనజం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొని హోమాన్ని ఆచరించారు. స్వామికి పుష్పయాగం కనుల విందుగా జరిగింది. 11 రకాల పూలతో స్వామికి వైభవంగా అర్చన చేశారు. కోరుకొండ రాంబాబు, సువర్ణ దంపతులు పుష్పయాగానికి అవసరమైన పూలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కోదండరాం, పలువురు భక్తులు పాల్గొన్నారు.





